
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.6 : కనిష్ఠం 24.9





రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు



సీఎస్ నిధుల గోల్‌మాల్!



కొత్త డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

- ఆగమేఘాలపై సంతకం చేసిన పాత డీఈవో దుర్గాప్రసాద్
- చక్రం తిప్పిన మాజీ జీసీడీవో
- ఎస్ఈఏఎస్ పరీక్షలకు సంబంధించిన బిల్లుల విడుదలపై వివాదం
- నిధుల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షాలో గత ఏడాది నిర్వహించిన ఎస్ఈఏఎస్ (సీస్) పరీక్షలకు సంబంధించిన బిల్లుల విడుదలపై బదిలీపై వెళ్లిన డీఈవో సంతకాలు చేయడం విద్యాశాఖలో తీవ్ర వివాదాన్ని రేపింది. ఈ వ్యవహారంలో అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న మాజీ జీసీడీవో చక్రం తిప్పి ఆగమేఘాలపై ఆ ఫైల్‌పై సంతకం చేయించడం పలు అనుమానాలకు తావిస్తోంది. జీసీడీవోతో పాటు ఏఎంవోగా పనిచేసిన సదరు అధికారిణి ఈ నిధుల వ్యవహారంలో భారీగా అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. కొత్త డీఈవో వస్తే తన అక్రమాలు ఎక్కడ బయటపడుతాయోనన్న భయంతో పాత డీఈవోతో చివరిరోజు సంతకాలు చేయించడం వివాదానికి కారణమైంది. ఎస్ఈఏఎస్ ద్వారా గత ఏడాది విద్యార్థులకు పలు పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి ఇన్విజిలేటర్లకు, అధికారులకు గౌరవ వేతనం, డీసీఈబీకి మిగిలిన డబ్బులు అందజేస్తారు. వీటికి సంబంధించి గత ఏడాది 9లక్షల 61వేల 399 రూపాయల నిధులు విడుదల కాగా ఇన్విజిలేటర్లుగా వ్యవహరించిన ఉపాధ్యాయులకు 8లక్షలకు పైగా అందజేశారు. ఇంకా రావాల్సిన 11లక్షల 33వేల 433 రూపాయల నిధులకు సంబంధించిన ఫైల్‌పై మంగళవారం బదిలీపై వెళ్లిన డీఈవో సంతకాలు చేసినట్లు తెలుస్తోంది. ఈ పరీక్షలు నిర్వహించినప్పుడు ఏఎంవోగా వ్యవహరించిన మాజీ జీసీడీవో వనిత అనేక అక్రమాలకు పాల్పడినట్లు సమాచారం. ట్రావెల్ అలవెన్స్‌తో పాటు భోజనాల ఖర్చు, టీ, స్నాక్స్ ఖర్చులో భారీగా నొక్కేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మండల లెవల్ కోఆర్డినేటర్లకు సైతం గౌరవ వేతనం ఇంకా ఇవ్వాల్సి ఉంది.

వివాదాస్పదమైన ఏఎంవో నియామకం...

సమగ్ర శిక్షాలో ఏఎంవోగా భీంగల్ మండలం పల్లికొండ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డిని బదిలీపై వెళ్లిన డీఈవో నియమించడం తీవ్ర వివాదానికి కారణమైంది. ఈ ఏఎంవో నియామకంలో మాజీ జీసీడీవో ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. తన అక్రమాలు బయటపడకూడదంటే తనకు అనుకూలంగా ఉన్న వ్యక్తిని ఏఎంవోగా నియమించాలని మాజీ జీసీడీవో డీఈవోపై ఒత్తిడి తెచ్చి సుధాకర్‌రెడ్డిని నియమించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేయడంతో ఏఎంవో నియామకాన్ని బదిలీపై వెళ్లిన డీఈవో దుర్గాప్రసాద్ నిలిపివేసినట్లు సమాచారం.

మాజీ జీసీడీవోపై అనేక ఆరోపణలు...

జీసీడీవోగా పనిచేసిన వనితపై అనేక ఆరోపణలు ఉన్నాయి. జీసీడీవోతో పాటు ఏఎంవో, ఆర్‌వీఎం ఎఫ్ఏవోగా అదనపు బాధ్యతలు నిర్వహించిన కాలంలో అనేక అక్రమాలకు పాల్పడినట్లు ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాయి. మూడేళ్ల పాటు పనిచేసిన ఆమె తిరిగి మళ్లీ జీసీడీవోగా వచ్చేందుకు ప్రయత్నాలు చేసినప్పటికీ ఉపాధ్యాయ సంఘాల ఫిర్యాదుతో బ్రేక్ పడింది. కేజీబీవీ, మోడల్ స్కూల్‌ల ఇన్‌చార్జిగా పనిచేసిన ఆమె అనేక అక్రమాలు చేసినట్లు తెలుస్తోంది. రేంజల్ మోడల్ స్కూల్ నిర్వహణకు సంబంధించిన నిధులు 2023 మార్చిలో రెండున్నర లక్షలకు పైగా మిగిలిపోగా మార్చి 31న తిరిగి పంపాల్సి

మిగతా 8వ పేజీలో...



సర్వే వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

సర్వేకు సహకరించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ధర్పల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకారాన్ని అందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు కోరారు. బుధవారం మండలంలోని సీతాయిపేటలో కుటుంబ సర్వేను ఆయన పరిశీలించారు. ఎన్యుమరేటర్లకు వాస్తవ వివరాలతో కూడిన సమాచారాన్ని అందించాలని సూచించారు. గ్రామంలోని ఇండ్లను సందర్శించిన ఆయన కుటుంబ సర్వే నిర్వహణ కోసం అతికించిన స్టిక్కర్లను చూసి వాటిపై నమోదు చేసిన ఇంటి నెంబరు, ఎన్యూమరేషన్ బ్లాక్, క్రమసంఖ్య, తదితర వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 3245 ఎన్యూమరేషన్ బ్లాక్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలను రికార్డుల ఆధారంగా ఎన్యూమరేషన్ బ్లాక్‌లను గుర్తించామన్నారు. ఈ నెల 6, 7, 8 తేదీలలో మూడు రోజుల పాటు హౌజ్ లిస్టింగ్ ప్రక్రియ కొనసాగుతుందని ఈనెల 9 నుంచి సమగ్ర కుటుంబ వివరాల సేకరణ ప్రారంభమవుతుందని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాలతి, ఎంపీడీవో బాలకృష్ణ పాల్గొన్నారు.



అనురాధను వివరాలు అడుగుతున్న పోలీసులు

వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక..

కుటుంబం ఆత్మహత్యాయత్నం

- బాసర గోదావరిలో దూకి తండ్రి, కూతురు మృతి
- భార్యను రక్షించిన స్థానికులు
- మృతులు నగరానికి చెందిన వారు



ఉప్పులంచి వేణు (ఫైల్)



పూర్ణిమ (ఫైల్)

గోదావరిలో తరచూ ఘటనలు..

బాసర గోదావరి తీరం ఆత్మహత్య ఘటనలతో ప్రతిరోజూ వార్తల్లోకెక్కుతోంది. భక్తుల పుణ్యస్నానాలు, పూజలతో ఆధ్యాత్మిక వాతావరణం ఆవరించి ఉండే నదీ తీరంలో రోజుకొక విషాద ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. చాలా సందర్భాల్లో స్థానికులు గమనించి వారిని రక్షిస్తున్నారు. నగరానికి చెందిన వేణు కుటుంబం ఆత్మహత్యాయత్నం చేసుకోవడానికి కంటే ముందే ఒకరిని స్థానిక జాలర్లు అడ్డుకొని రక్షించారు. ఇలా తరచూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడంపై స్థానికులు, భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖిల్లా, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక ఓ కుటుంబం నిర్మల్ జిల్లా బాసర గోదావరిలో దూకి ఆత్మహత్యకు యత్నించింది. కూతురితో సహా తల్లిదండ్రులు గోదావరి నదిలో దూకగా.. తండ్రి, కూతురు మృతి చెందారు. భార్యను మాత్రం స్థానికులు రక్షించారు. బాధితురాలి కథనం ప్రకారం.. నగరంలోని న్యాల్‌కల్‌రోడ్డులో ఉప్పులంచి వేణు (50) నివాసం ఉంటు న్నాడు. ఇతనికి భార్య అనురాధ, కూతురు పూర్ణిమ (24) ఉన్నారు. వేణు నగరంలోని గంజ్‌లో వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే వ్యాపార నిమిత్తం వేణు నగరానికి చెందిన వడ్డీ వ్యాపారులు రోషన్, వికాస్‌ల వద్ద రెండేళ్ల క్రితం రూ. 3లక్షల అప్పు తీసుకున్నాడు. తీసుకున్న రూ.3 లక్షల అప్పులో వరకు చెల్లించాడు. అయినప్పటికీ ఇంకా బాకీ మిగిలి ఉందని, అదీ కూడా వెంటనే చెల్లించాలని వ్యాపారులు వేణుపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఒకవేళ వడ్డీతో సహా అప్పు చెల్లించని పక్షంలో కూతురు పూర్ణిమ సంగతి తేల్చుతామని వేణును భయపెట్టారు. ఓ వైపు వ్యాపారంలో నష్టం రావడం.. మరో వైపు చేతిలో డబ్బుల్లేకపోవడం.. ఇంకోవైపు తన కూతురి సంగతి తేల్చుతామని వడ్డీ వ్యాపారులు వేధించడం.. దీంతో భయాందోళనకు గురైన వేణు కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా బుధవారం నిర్మల్ జిల్లాలోని బాసర గోదావరి వద్దకు చేరుకున్నారు. కూతురితో సహా తల్లిదండ్రులు గోదావరి నదిలో దూకారు. గమనించిన స్థానికులు వారిని రక్షించే ప్రయత్నం చేయగా.. తండ్రి వేణు, కూతురు పూర్ణిమ మృతి చెందారు. వేణు భార్య అనురాధను మాత్రం స్థానికులు రక్షించారు. అను రాధను చికిత్స నిమిత్తం నిర్మల్ జిల్లా భైంసా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు బాసర ఎస్సై గణేష్ తెలిపారు.

జిల్లాలో 629 కొనుగోలు కేంద్రాలు

- వేర్వేరుగా సన్నరకం, దొడ్డురకం ధాన్యం సేకరణ
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ధర్పల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 629 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. మంగళవారం మండలంలోని సీతాయిపేట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి సన్నరకం, దొడ్డురకం ధాన్యం సేకరణపై వేర్వేరుగా కేంద్రాలను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. కనీస మద్దతు ధరతో పాటు సన్న ధాన్యానికి ప్రభుత్వం క్వింటాలుకు రూ.500ల బోనస్ అందజేయనున్నట్లు ఈ మేరకు ఓపీఎంఎస్‌తో పాటు ఆన్‌లైన్‌లో, లోకల్ యాప్‌లో వివరాలు నమోదు చేయిస్తున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని వెంటనే నిర్దేశించిన రైస్‌మిల్లులకు తరలించే ప్రక్రియను వేగవంతం చేశామని ఆయన పేర్కొన్నారు. అన్ని కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచామని లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్న ప్రక్రియను పరిశీలించి కేంద్ర నిర్వాహకుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ఏ మేరకు సన్నరకం, దొడ్డురకం ధాన్యం సేకరించారని, ట్రక్‌షీట్స్ వచ్చాయా, బిల్ ట్యాగ్ అయ్యిందా, కొత్త గన్నీ బ్యాగులు అందాయా అని ఆరా తీశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన వివరాలను ఓపిఎంఎస్‌తో పాటు లోకల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మాలతి , ఎంపీడీవో బాలకృష్ణ, ఇతర అధికారులు ఉన్నారు.

ఉత్తమ ఓటరు అవగాహన ప్రచార అవార్డులకు నామినేషన్ల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు విలువ, ఓటు హక్కు వినియోగంపై 2024 సంవత్సరంలో ఓటర్లకు అవగాహన పెంపొందించి చైతన్యపర్చడానికి కృషి చేసిన ఉత్తమ ప్రచారానికి సంబంధించి భారత ఎన్నికల సంఘం మీడియా అవార్డులను ప్రకటించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఒక ప్రకటనలో తెలిపారు. మీడియా హౌజ్‌లో నుంచి 2024 సంవత్సరానికి ఉత్తమ ఓటరు అవగాహన ప్రచార అవార్డుకు నామినేషన్‌లు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవార్డులు నాలుగు విభాగాల్లో ఉన్నాయని ప్రింట్ మీడియా, టెలివిజన్ రేడియో, ఆన్‌లైన్ సోషల్ మీడియాకు ఒక్కొక్కరికి చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. ఓటరు హక్కులపై అవగాహన పెంపొందించడం, ఎలక్షన్ టెక్నాలజీ అంశాలను ప్రచారం చేయడం వంటి అంశాలలో ప్రాముఖ్యతను చూసిన మీడియా సంస్థలను గుర్తించడం ఈ అవార్డుల ప్రధాన లక్ష్యమన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జనవరి 25న ఈ అవార్డులను అందజేయడం జరుగుతుందన్నారు. ప్రచార నాణ్యత, ఖచ్చితత్వం, ప్రజాపరిజ్ఞానం, ఓటర్లకు సరైన సమాచారాన్ని అందించడం, ప్రత్యేక కథనాలు, చర్చలు వంటి అంశాల ఆధారంగా ఈ అవార్డులను నిర్ణయిస్తారని ప్రతీ విభాగంలో పాల్గొనే సంస్థలు తమ ప్రచారం యొక్క సారాంశం, ప్రచురణ లేదా ప్రసారం యొక్క వార్త ఇతర సం బంధిత ప్రచార కార్యక్రమాలతో సహా నిజ ప్రతులను సమర్పించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. డిసెంబర్ 10వ తేదీలోగా తమ సిఫార్సులను రాజేష్ కుమార్‌సింగ్, అండర్ సెక్రెటరీ (కమ్యూనికేషన్), ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా, నిర్వచన్ సదన్, అశోక్‌రోడ్, న్యూఢిల్లీ 110001 చిరునామాకు పంపాలని ఆయన తెలిపారు.

డీఈవోగా బాధ్యతలు స్వీకరించిన అశోక్




నూతన డీఈవో అశోక్ కుమార్‌ను అభినందిస్తున్న పాత డీఈవో, సిబ్బంది

నిజామాబాద్ అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమితులైన అశోక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు డీఈవోగా పనిచేసిన దుర్గాప్రసాద్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు ఇచ్చి శాలువ కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. డీఈవోగా పనిచేసిన దుర్గాప్రసాద్‌ను మోడల్ స్కూల్ డైరెక్టర్‌గా ప్రభుత్వం ఇటీవల బదిలీ చేసింది. డైట్ కళాశాలలో సీనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న అశోక్‌కుమార్‌కు జిల్లా విద్యాశాఖ అధికారి (ఎఫ్ఏసీ)గా నియమించారు. డీఈవోగా బాధ్యతలు స్వీకరించిన అశోక్‌కుమార్‌కు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.మోహన్‌రెడ్డి, గంగోనె కిషన్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెనిగళ్ల సురేష్, సల్ల సత్యనారాయణ, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు రమేష్, మల్లికార్జున్, గంగయ్య, స్టేట్ టీచర్స్ యూనియన్ ప్రతినిధులు, ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రచ్చ మురళి, ప్రశాంత్‌రెడ్డి, చెన్నయ్య, రాంచందర్, ఎస్‌జీఎఫ్ ప్రధాన కార్యదర్శి నాగమణి, వ్యాయామ ఉపాధ్యాయులు గోపిరెడ్డి, మధుకర్, తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

భక్తుల కొంగుబంగారం

శ్రీమన్నింబాచలం

- లింబాద్రిగుట్టపై నేటి నుంచి 17వరకు ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ నిర్వాహకులు



7

అడుగడుగునా గుంతలు!

- ప్రమాదకరంగా జాతీయ రహదారి
- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

7



కంకర తేలి ప్రమాదకరంగా మారిన రోడ్డు



ఊపందుకోని ధాన్యం కొనుగోళ్లు

- జిల్లాలో ధాన్యంలో తరుగుతీతపై రైతుల ఆందోళన
- ప్రతీ సీజన్‌లో పలు కారణాలు చెప్పి క్వింటాలుకు 3కిలోల వరకు తరుగు తీస్తున్న కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు
- తరుగువల్ల సీజన్‌లో వేల రూపాయలు నష్టపోతున్న రైతులు
- ఎన్ని దఫాలు ఫిర్యాదులు చేసినా నోటీసులతో సరిపెడుతున్న అధికారులు
- సొసైటీల గోల్‌మాల్‌పై దృష్టిపెట్టాలంటున్న అన్నదాతలు

నిజామాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకోలేదు. ఆలస్యంగా వారం రోజుల క్రితమే ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు. ఇప్పటి వరకు పెద్ద ఎత్తున కొనుగోళ్లను మొదలు పెట్టలేదు. ఇంకా ధాన్యం నిల్వలను సేకరించలేదు. జిల్లా వ్యాప్తంగా రైతుల వద్ద భారీగా ధాన్యం నిల్వలు ఉన్నాయి. ఈ మధ్యనే ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో అధికారులు కొనుగోళ్లను చేపడుతున్నారు.

ఇప్పటి వరకు 400 కేంద్రాల ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో మొత్తం 480 కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు 400లకు పైగా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 15వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ప్రతీరోజు ఎక్కువ మొత్తంలో కొనేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను చేపట్టడంతో పాటు వెంట వెంటనే తరలించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. తేమ శాతం నిబంధనల మేరకు ఉన్న ధాన్యాన్ని కొనే విధంగా ఏర్పాట్లను చేశారు.

మూడు కేటగిరీలుగా రైస్‌మిల్లుల విభజన

జిల్లాలోని ఉన్న రైస్‌మిల్లులను మూడు కేటగిరీలుగా విభజించారు. ధాన్యం కేటాయింపుల కోసం మిల్లర్ల నుంచి గ్యారంటీని తీసుకుంటున్నారు. ప్రతీ మిల్లు నుంచి గ్యారంటీ ఇచ్చిన తర్వాతనే ధాన్యం పంపించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మిల్లర్లకు సమయం ఇచ్చే విధంగా ముందుగా వారి నుంచి అఫిడవిట్‌ను గ్యారంటీ కోసం తీసుకుంటున్నారు. ఎలాంటి ఆరోపణలు లేని మిల్లులకు ముందుగా 10 శాతం గ్యారంటీ తీసుకొని కేటాయించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. కొన్ని ఆరోపణలు ఉన్న వాటికి ఎక్కువ మొత్తంలో సెక్యూరిటీ తీసుకునే విధంగా నిర్ణయం తీసుకున్నారు. ధాన్యం తీసుకొని బియ్యం ఇవ్వని మిల్లుల నుంచి ఎక్కువ మొత్తంలో సెక్యూరిటీని పెడితేనే కేటాయించే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైనందున త్వరగా తరలించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు.

సొసైటీల గోల్‌మాల్!

జిల్లాలో ప్రతి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లను చేపడుతున్నా కొన్ని సొసైటీల గోల్‌మాల్‌ను మాత్రం పట్టించుకోవడం లేదు. ధాన్యం బాగా ఉన్న కడ్తా పేరుమీద క్వింటాల్‌కు 3కిలోల వరకు తరుగు తీస్తున్నారు. ఏళ్ల తరబడి ప్రతీ సీజన్‌లో ధాన్యం బాగా ఉన్నా కడ్తా లేనిదే కొనుగోలు చేయడం లేదు. రైతులు కడ్తాపై ఆందోళన నిర్వహించినా పట్టించుకోవడం లేదు. అధికారుల నుంచి ప్రజాప్రతినిధుల వరకు ఫిర్యాదులు చేసినా యథేచ్ఛగా ఈ దోపిడీ కొనసాగుతూనే ఉంది. రైతులకు సహకారం అందించాల్సిన ఆ శాఖ అధికారులే కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న గోల్‌మాల్‌ను పట్టించుకోకపోవడం లేదు.

మిగతా 8వ పేజీలో...

బోధన్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో బుధవారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు దేశం పార్టీ బోధన్ నియోజకవర్గ అధ్యక్షులు కోట గోపాల్ రెడ్డి మాట్లాడుతూ సభ్యత్వ నమోదు రుసుము ఎప్పటి లాగా వంద రూపాయలు ఉంటుందన్నారు. వచ్చే స్థానిక ఎన్నికలలో తెలుగు దేశం పార్టీ అన్ని చోట్ల పోటీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ జిల్లా పార్లమెంటరీ ఉపాధ్యక్షులు పావులూరి వెంకటేశ్వర్ రావు, పట్టణ అధ్యక్షులు ఉదయ్ భాస్కర్‌లతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన ఉండాలి

బోధన్‌రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన ఉండాలని పట్టణ సీఐ వెంకట నారాయణ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని ఉషోదయ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగిఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ కళాశాల యాజమాన్యం సూర్యప్రకాష్, సైబర్ క్రైమ్ పోలీసులు, సిబ్బంది తదితరులున్నారు.

అర్గుల్ పాఠశాలలో..

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సుశీల్‌కుమార్ అన్నారు. బుధవారం అర్గుల్ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలపై తల్లిదండ్రులకు విద్యార్థుల అవగాహన కల్పించాలని, విద్యార్థులు దూరంగా ఉండాలని, గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని పోలీసులు అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని పోలీసులు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ నిర్వహణపై ఫిర్యాదు

బోధన్‌రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని పౌర సరఫరా శాఖ ఎంఎల్ఎస్ పాయింట్ సిబ్బంది వ్యవహార శైలిపై బోధన్ రేషన్ డీలర్లు బుధవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు ఫిర్యాదు చేశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు నగేష్ మాట్లాడుతూ ఎంఎల్ఎస్ పాయింట్ సిబ్బంది వ్యవహార శైలి తమను నష్టాలకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బంది తీరును నిరసిస్తూ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద డీలర్లు ఆందోళన నిర్వహించి అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించామన్నారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్లు మాట్లాడుతూ రేషన్ షాపులకు సరఫరా చేసే బియ్యం తక్కువగా సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. రేషన్ డీలర్ల సమస్యలను పట్టించుకోవడం లేదని సబ్ కలెక్టర్‌కు వివరించారు. తూకం వేసి బియ్యాన్ని రేషన్ షాపులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు నాగేష్, రేషన్ డీలర్లు భీష్మ, శ్రీనివాస్, సుదర్శన్, ప్రతాప్ గుప్తా, సనా పటేల్ పాల్గొన్నారు.

విద్యార్థి అమరవీరుల స్ఫూర్తితో పోరాడుదాం

- పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్

కోటగిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి అమరవీరుల స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై పోరాడుదామని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ పిలుపునిచ్చారు. జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ స్వగ్రామమైన కోటగిరి మండలంలోని ఎత్తొండ గ్రామంలో బుధవారం జంపాల 50వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. విద్యార్థి అమరవీరుల స్ఫూర్తితో శాస్త్రీయ విద్య విధానం కోసం విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 52ఏళ్ల క్రితం కామ్రేడ్ జార్జిరెడ్డిని హత్య చేసిన మతోన్మాద శక్తులు నేడు దేశాన్ని పరిపాలిస్తున్నాయన్నారు. మోడీ పాలనలో యూనివర్సిటీలు అగ్రకుల ఆగ్రహారాలుగా మారాయని విమర్శించారు. వేలాది ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల ఖాళీలతో యూనివర్సిటీ విద్య సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. విద్యారంగాన్ని కార్పొటీకరణ, కాషాయికరణ, కేంద్రీకరణ చేయడం కోసమే నూతన జాతీయ విద్యా విధానం మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యారంగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు శంకర్, మల్లేష్, నరేందర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బాలికల హైస్కూల్ విద్యార్థిని ఎంపిక

భీమ్‌గల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని బోయిగల్లీలో గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన వేదశ్రీ ఎస్‌జీఎఫ్ -14 విభాగంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ రమణ తెలిపారు. ఈనెల 5న జిల్లా పరిషత్ హైస్కూల్ కల్లెడిలో జరిగిన పోటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు పీడీ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఎంఈవో స్వామి ఆధ్వర్యంలో బుధవారం శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింబాద్రి, రఘువాస్, రాములు, మురళీ, వినోద్, శివ, కుమార్, రాజ్‌కుమార్, అనురాధ, రాధిక, శరణ్య, గంగామణి, తదితరులు ఉన్నారు.

అండర్ -17 ఖోఖో పోటీల్లో..

ముప్కాల్: మహాత్మజ్యోతిరావుపూలే కాగాజ్‌నగర్‌లో నిర్వహించిన అండర్ -17 ఖోఖో పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బాల్కొండ మోడల్ స్కూల్ విద్యార్థిని అపర్ణ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు మోడల్ స్కూల్ పీడీ ముత్తెన్న తెలపారు. ఈనెల 8 9, 10తేదీల్లో ఖమ్మం జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు తొర్లికొండ విద్యార్థుల ఎంపిక

జక్రాన్‌పల్లి: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ -19 సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని తొర్లికొండ ఉన్నత పాఠశాల విద్యార్థులు జక్కం శ్రవ్య, పత్రి అకిల్‌లు ఎంపికైనట్లు బుధవారం పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు గంగామోహన్ తెలిపారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ఈనెల 8నుంచి 10వ తేదీ వరకు జరిగే ఈ పోటీలలో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

బీచ్ వాలీబాల్ పోటీలకు మగ్గిడి విద్యార్థినులు..

ఆర్మూర్‌రూరల్: మండలంలోని మగ్గిడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మధు తెలిపారు. బుధవారం కలిగోట్ పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి అండర్ -17 ఎస్‌జీఎఫ్ బాలబాలికల బీచ్ వాలీబాల్ పోటీల్లో మగ్గిడి పాఠశాల బాలికలు హీమప్రియ, రిషిప్రియలు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు.

తొర్లికొండలో స్కూల్ గేమ్స్ వాలీబాల్ ఎంపిక పోటీలు

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ వాలీబాల్ అండర్-14 ఆర్మూర్‌రూరల్ జోన్ బాలబాలికల ఎంపిక పోటీలను నిర్వహించారు. బుధవారం ఈ పోటీలను పాఠశాల హెచ్‌ఎం కె.సాయిలు ప్రారంభించారు. నిజామాబాద్‌లో డిస్ట్రిక్ ఫోర్స్ అథారిటీ క్రీడా మైదానంలో ఈనెల 8న జరిగే జిల్లా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, వ్యాయమ ఉపాధ్యాయుడు గంగామోహన్, శ్రీనివాస్, యాదగిరి, మధు, మురళీ, భూపతి, ఇన్‌చార్జీ హెచ్‌ఎం సాయిలు, పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి పాఠశాల అభివృద్ధికి ఎంపీ అర్వింద్ నిధుల మంజూరు

జక్రాన్‌పల్లి, నవంబరు6(ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలు అభివృద్ధి పనులకు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ రూ.4లక్షల 90వేల నిధులను మంజూరు చేయించినట్లు బీజేపీ నాయకులు కన్నెపల్లి ప్రసాద్ బుధవారం తెలిపారు. ఈ నిధుల మంజూరు ప్రొసీడింగ్ పత్రాన్ని పాఠశాల హెచ్‌ఎం లింగయ్యకు బీజేపీ నాయకులు అందజేశారు.

పెద్దాస్పత్రిలో స్టాఫ్ నర్సుల కొరత


- ఇబ్బందులు పడుతున్న రోగులు



రోగులతో కిటకిటలాడుతున్న ఆసుపత్రి

మద్నూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్నూర్ మండల కేంద్రంలో ఉన్న 30 పడకల పెద్ద ఆసుపత్రిలో సిబ్బంది కొరతతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. 30 పడకల ఆసుపత్రిలో ఏడుగురు వైద్యులు ఉండగా వారిలో ఇద్దరిని డిప్యూటేషన్‌పై మరో చోటికి పంపడం జరిగింది. ఉన్న ఐదుగురు డాక్టర్లు ఆసుపత్రికి వచ్చి రోగులను చూసి వారికి ఇంజక్షన్ ఇవ్వడానికి సిబ్బంది కొరత కారణంతో ఇబ్బందులు తప్పడం లేదు. వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో 12 మంది స్టాఫ్ నర్సులు ఉండాల్సి ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే స్టాఫ్ నర్సులు పని చేస్తున్నారు. దీంతో ఏఎన్‌ఎంలతోనే రోగులకు ఇంజనక్షన్లు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండల కేంద్రంలో ఉన్న వైద్య విధాన పరిషత్ జుక్కల్ నియోజకవర్గంలోని పెద్ద ఆసుపత్రిగా పేరు పొందింది. గతంలో ఈ ఆసుపత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు సైతం చేసేవారు. రోజురోజుకు సిబ్బంది కొరత ఏర్పడటంతో కుటుంబ ఆపరేషన్ల శిబిరాన్ని కూడా నిలిపివేశారు. ప్రభుత్వం ఒక వైపు గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందజేస్తామని ప్రకటిస్తున్నప్పటికీ సిబ్బంది భర్తీ చేయలేకపోతున్నారని రోగులు వాపోతున్నారు. 12 మంది ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్సులు ఉండాల్సిన చోట కేవలం ముగ్గురు మాత్రమే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఐదుగురు డాక్టర్లు, పేషెంట్లకు చూసి వారికి ఇంజక్షన్ చేయాల్సి రావడంతో ఉన్న ముగ్గురు స్టాఫ్ నర్సులు మాత్రమే పనులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వారికి పని భారం పెరగడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రికి రాకపోయినట్లయితే ఇంజక్షన్లు ఇవ్వడానికి ఎవరూ ఉండలేక పోతున్నారు. వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో ఒకప్పుడు వైద్యుల కొరత ఉండేది కాని ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైద్యులను నియమించారు. కాని సిబ్బందిని నియమించకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వైద్య విధాన పరిషత్‌కు ఓపీలో 200లకు పైగా రోగులు వస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. స్టాఫ్ కొరతతో రోగులకు సరైన సేవలు అందడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి గతంలో ఉన్న విధంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని స్టాఫ్ నర్సులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇష్టపడి చదివితే బంగారు భవిష్యత్తు: డీఈవో అశోక్


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో అశోక్


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో

మోస్రా, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా విద్యాశాఖ అధికారి మోస్రా జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఆవరణలో పూల మొక్కలు, మరుగుదొడ్లు, భోజన శాల, వంటగది స్థితిగతులను పరిశీలించి, పాఠశాలను అన్ని విధాల అభివృద్ధి చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు బాలాజిని అభినందించారు. అనంతరం 9వ తరగతి, పదో తరగతి విద్యార్థులకు పాఠాలు చెప్పి వారి సామర్థ్యాలను పరిశీలించి విద్యార్థులు ఈ దశలో కష్టపడి ఇష్టంతో చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుని సంతోషకరమైన జీవితం కొనసాగిస్తారని ఆయన విద్యార్థులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి పిల్లలతో పాటు ఆయన కూడా కింద కూర్చొని భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ కో ఆర్డినేటర్ సీతయ్య, ఎంఈవో నాగనాథ్, ప్రధానోపాధ్యాయుడు బాలాజీ, ఉపాధ్యాయుడు రాజేశ్వర్ పాల్గొన్నారు.

కుటుంబ సర్వేకు ప్రతీ ఒక్కరు సహకరించాలి

- బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో


కోటగిరిలో సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

బోధన్‌రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణకై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా జరిపిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు తమవంతు పూర్తి సహకారం అందించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. సర్వే కోసం ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు వాస్తవ వివరాలతో కూడిన సమాచారాన్ని ప్రజలు అందించాలని సూచించారు. బుధవారం బోధన్ మండలంలో ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్న తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ఇళ్లను సందర్శించి కుటుంబ సర్వే నిర్వహణ కోసం అతికించిన స్టిక్కర్లను చూసి వాటిపై నమోదు చేసిన ఇంటి నెంబర్, ఎన్యూమరేషన్ బ్లాక్, క్రమసంఖ్య తదితర వివరాలు పరిశీలించారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పకడ్బందిగా సర్వే జరపాలని అధికారులను ఆదేశించారు. ఇంటింటి సర్వేలో భాగంగా 6, 7, 8 మూడు రోజుల పాటు హౌస్ విజిటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని, 9వ తేది నుండి సమగ్ర కుటుంబ వివరాల సేకరణ ప్రారంభం అవుతుందని వివరించారు.

పెంటాఖుర్దు గ్రామంలో పరిశీలన

బోధన్ మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలో ఇంటింటి కుటుంబ సర్వేను బోధన్ ఎంపీడీవో బాల గంగాధర్ పరిశీలించారు. ఇంటిపై అతికించిన స్టిక్కర్లను, వాటిపై నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో మధుకర్, పంచాయతీ కార్యదర్శి తదితరులున్నారు.

కోటగిరి: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన కుల గణన సర్వే కోటగిరి ఉమ్మడి మండలంలో బుధవారం ప్రారంభమైంది. ఇన్యూమలేటర్లు ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి పలు గ్రామాలలో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు.

ఎడపల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన కుల గణన సర్వే ఎడపల్లి మండలంలో బుధవారం ప్రారంభమైంది. ఇన్యూమలేటర్లు ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్ళి వారి ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబాల సర్వే చేపట్టారు. ఈ నెల 8 వరకు కుటుంబాల సర్వే చేసిన తరువాత 9వ తేదీనుండి కుల గణనను చేపడతారని ఎంపీడీవో శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నాగరాజు గౌడ్, గంగాధర్, రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ, ముప్కాల్ మండాల్లోని ఆయా గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేనుఅధికారులు నిర్వహించారు. గ్రామాల్లో తమకు ఇచ్చిన వివరాల ప్రకారం సమాగ్ర సర్వే పోస్టర్లను ఆతికించారు.

కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక విద్యా ఉపాది రాజకీయ, కులగణన కుటుంబసర్వే బుధవారం లాంచనంగా ప్రారంభమయింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి అములుజరుపుతున్న ఇంటిట కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు దొర్లకుండా పకడ్బదీంగా చేపట్టాలని కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చూర్మన్ పాలెపు నర్సయ్య అన్నారు. బుధవారం కమ్మరపల్లి గ్రామ పంచాయతిలో ఎన్యూమనేటర్లకు సర్వే మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన చైర్‌పర్సన్, కమిషనర్

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలో 36వార్డులలో జరుగుతున్న సమాగ్ర కుటుంబ సర్వేను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్, కమిషనర్ రాజులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహిస్తుందని, ప్రజలు సర్వేకు వచ్చిన సిబ్బందికి సహకరించాలని, ప్రజా శ్రేయస్సు కోసమే రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేపడుతుందని అన్నారు.

వేల్పూర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వేల్పూర్ మండల గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

లక్కోరలో డీవీకే వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

వేల్పూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కోర గ్రామంలో తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీపీఐఎంఎల్ ప్రజాపంథ తెలంగాణ కార్యదర్శి దుర్గపూడి వెంకటకృష్ణ (డీవీకే) విగ్రహావిష్కరణ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంఆ టీయుసీఐ నాయకుల అర్వింద్ మాట్లాడుతూ కామ్రెడ్ డీవీకృష్ణ 55 ఏళ్ల క్రితం ముందు తానపు లేబర్ ఆఫీస్‌లో పనిచేశానని, అ సమయంలో కార్మికులను యాజమాన్యం దోచుకుంటున్నారని గ్రహించి తమ ఉద్యోగాన్ని వదిలి పెట్టిన డీవీకే కార్మికులకు, ప్రజలకు సేవ చేయాలన్న పట్టుదలతో వారికి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేసిన కామ్రెడ్ డీవీకే అన్నారు. ఈ నెల 9న ఆర్మూర్‌లో జరిగే డివికె విగ్రహ ఆవిష్కరణకు వివిధ సంఘాల కార్మికులు, మేథావులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విగ్రహాష్కరణ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీకేటీపీ బీడీ ప్యాకర్లు గంగాధర్, అన్వర్, సాయన్న, ఆనంద్, రమేష్, ఎడ్డన్న, జగదీశ్వర్, బుచ్చి రాములు పాల్గొన్నారు.


ఏర్గట్లలో 4 లక్షల 77 వేల చేప పిల్లల పంపిణీ

ఏర్గట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మత్స్యకార సంఘాలకు 4లక్షల 77వేల660 చేపలు అందజేశామని జిల్లా మత్స్యకార జిల్లా ఏడీ ఆంజనేయ స్వామి తెలిపారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు మత్స్య కారులకు చేప పిల్లలను పంపిణీ చేశామని మండలంలో మొత్తం 21 చెరువుల్లో చేప పిల్లలను నీటిలో విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, జీపి కార్యదర్శులు, సహకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

జక్రాన్‌పల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ గ్రామంలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ శిబిరాన్ని అర్గుల్ వీడీసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారిణి డాక్టర్ హర్షిత, జూనియర్ పశువైద్యాధికారి డాక్టర్ శశిరేఖ, వీడీసీ సభ్యులు, గోపాల మిత్రలు, రైతులు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన


పచ్చలనడ్కుడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వేల్పూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పచ్చల నడ్కుడ, వాడి, కొత్తపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతు న్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం సొసైటీ చైర్మన్ గడ్డం లింబారెడ్డితో కలిసి మానిటరింగ్ అధికారి దినేష్‌బాబు పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో కొనసాగింపులో ఏమైన సమస్యలు ఎదురవుతున్నాయా సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చే వరిధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల వసతుల కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి యు.స్వామి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కమ్మర్‌పల్లి, నవంబరు 6: (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి సహకారం సంఘం పరిధి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కమ్మర్‌పల్లి రైతు సహకార సంఘం చైర్మన్ రేగుంట దేవేందర్ అన్నారు బుధవారం కమ్మర్‌పల్లి సొసైటి పరిధిలోని ఉప్లూర్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు ప్రభ్యుఅదేశాలను పాటిస్తూ వరి పంటను కొనుగోలు కేంద్రాలలో విక్రయించి ప్రభుత్వం మద్దతు ధరలు పొందాలని సూచించారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా తగిన ఏరాట్లు చేసినట్లు తెలిపారు. ఏగ్రేడ్, బిగ్రేడ్ రకాలకు ప్రబుత్వం ప్రకటించిన ధరలకు విక్రయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు బద్దం రమేష్ రెడ్డి, సుంకరి విజయ్ కుమార్, తక్కూరి దేవందర్, అవారి మురళి, రాజరెడ్డి, అవారి గంగాధర్, కార్యదర్శి శంకర్ తదితర గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడి వ్యక్తి మృతి

బోధన్‌రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూలక్ష్మీ క్యాంప్ గ్రామానికి చెందిన వెంకట్ రాంరెడ్డి(37)అనే వ్యక్తి ప్రమాదవశాత్తు గ్రామ శివారులోని డీ46 కెనాల్‌లో బుధవారం తెల్లవారుజామున కాలకృత్యాల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందినట్లు రూరల్ ఎస్సై మశ్చేందర్ రెడ్డి తెలిపారు. తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి శివారులోని డీ46 కెనాల్ వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు కెనాల్‌లో బోర్ల పడడంతో మృతి చెందాడని భార్య కృష్ణ వేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

అంతంపల్లి వద్ద రోడ్డు ప్రమాదం.. ఒకరి మృతి

భిక్కనూరు, నవంబరు 6: మండలంలోని అంతంపల్లి వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పుల్లూరి మల్లయ్య(60) గ్రామశివారులోని 44వ జాతీయరహదారి పక్కన గల తన పత్తి చేను వద్దకు తన సైకిల్‌పై వెళ్తుండగా భిక్కనూరు వైపు నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం వెనుకాల నుంచి ఢీకొనడంతో మల్లయ్య తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందగా ద్విచక్రవాహనంపై ఉన్న గుర్తుతెలియని వ్యక్తి సైతం గాయపడ్డాడు. ఈ మేరకు పోలీసులు గాయపడిన వ్యక్తిని అంబులెన్స్‌లో కామారెడ్డికి తరలించగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్వదేశానికి చేరిన గల్ఫ్ మృతదేహం

ముప్కాల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో గత 31న బెహరన్‌లో మృతి చెందిన తడూరి లింబాద్రి(58) మృతి చెందారు. బుధవారం స్వగ్రామమైన ముప్కాల్ మండల కేంద్రానికి గల్ఫ్ మృతదేహం చేరింది. కుటుంబానికి పెద్దదిక్కు కోల్పోడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. స్వదేశానికి మృతదేహం రావడానికి ప్రయత్నించిన స్నేహితులు మధు, చింతకింది నర్సారెడ్డి, తెలంగాణ గల్ఫ్ సమితి సభ్యులు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇద్దరికి జీవిత ఖైదు

బోధన్‌రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డుగా వస్తుందని దేవక్కె సంజీవ్, నక్క చెందుల రజిత ఇద్దరు కలిసి అమ్ములు అనే మూడేళ్ల పాప అడ్డుగా ఉందని కర్రలతో కొట్టి చంపిన సంఘటన బుధవారం బోధన్ కోర్టు న్యాయమూర్తి ఇద్దరికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పును వెల్లడించారని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. వీరిద్దరు బతుకుదెరువు కోసం బాల్కొండలో పనిచేస్తున్న క్రమంలో ఒకరినొకరు పరిచయమై రజిత తన భర్తను వదిలి తన మూడేళ్ల కూతురు అమ్ములును తీసుకుని సంజీవ్‌తో కలిసి బోధన్ మండలం కల్దుర్కి గ్రామానికి వచ్చి సంజీవ్ ఇంట్లో ఉండేవారన్నారు. ఈ క్రమంలో వారి యొక్క అక్రమ సంబంధానికి అమ్ములు అడ్డుగా ఉందని ఇద్దరు కలిసి కర్రతో కొట్టి చంపి గ్రామంలోని చెరువు శివారు దగ్గర పడేశారని తెలిపారు. ఈ కేసులో విచారణ అనంతరం బుధవారం సంజీవ్, రజితకు న్యాయమూర్తి జీవిత ఖైదు శిక్ష విధించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కిరణ్ కుమార్, మశ్చేందర్, తుకారాం, పోలీసులు తదితరులున్నారు.

తల్లీ పిల్లల అదృశ్యం

బోధన్‌రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సాలూర మండల కేంద్రానికి చెందిన తల్లి, కూతుళ్లు మంగళవారం ఉదయం నుంచి అదృశ్యమయ్యారని బోధన్ రూరల్ ఎస్సై మశ్చేందర్ రెడ్డి తెలిపారు. సాలూర మండల కేంద్రానికి చెందిన వివాహిత షమ, తన కూతురు తహరిన్, కొడుకులు సాదీక్, రిజ్వాన్‌లతో మంగళవారం ఉదయం 8గంటల ప్రాంతంలో ఇంటి నుండి వెళ్లిపోయిందని కుటుంబ సభ్యుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదని, షమ భర్త షారూఖ్ బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు.

దర్యాపూర్‌లో వ్యక్తి ..

నవీపేట: మండల కేంద్రంలోని దర్యాపూర్‌కు చెందిన డాంగే లక్ష్మణ్ అనే 44 సంవత్సరాల వ్యక్తి అదృశ్యమయ్యాడని ఎస్సై వినయ్ తెలిపారు. మాక్లూర్ మండలం మానిక్ బండార్‌కు చెందిన నవనీతతో 25 సంవత్సరాల క్రితం లక్ష్మణ్‌కు వివాహం జరిగిందని అన్నారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారని, కుటుంబ కలహాలతో గత 15సంవత్సరాల నుండి నవనీత తన ఇద్దరి పిల్లలతో కలిసి మానిక్ బండార్‌లో అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తూ జీవిస్తుందన్నారు. నవీపేటలో ఒంటరిగా ఉంటున్న లక్ష్మణ్ గత ఆగస్టు మాసం నుండి కనిపించడం లేదని ఆస్తి విషయంలో తన బావ డాంగే నర్సయ్యతో గొడవలు ఉన్నాయని, తన భర్త అదృశ్యంపై తన బావపై అనుమానం ఉన్నట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్సై తెలిపారు.

సుంకినిలో మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోటగిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకిని మంజీర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం అర్ధరాత్రి తహసీల్దార్ మల్లయ్య పట్టుకున్నారు. సుంకిని నుంచి కొల్లూర్ వైపు వస్తుండగా ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టుకున్న వాహనాలపై రవాణా, మైనింగ్ అధికారులకు తగిన చర్యల కోసం సిఫారసు చేస్తామని ఆయన తెలిపారు. మరోమారు ఇసుక వాహనాలు పట్టుపడితే ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుంటామని, వారిపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపిస్తామన్నారు. ఇసుక అవసరమైన వారు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించి డీడీ చెల్లించాలని, తద్వారా ఇసుక రవాణాకు అనుమతి ఇస్తామని ఆయన పేర్కొన్నారు.

ఆటో బోల్తా.. ముగ్గురు విద్యార్థులకు గాయాలు

ముప్కాల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల శివారులో జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం ఆటో బోల్తా పడి ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బాల్కొండ మండలం కిసాన్‌న గ్రామంలో నచికేతర ఆశ్రమానికి చెందిన విద్యార్థులు ముప్కాల్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్ళారు. పాఠశాల నుంచి ఒక ఆటోలో 11మంది విద్యార్థులు ఆశ్రమానికి తిరిగి వస్తుండగా ముప్కాల్ శివారులో ఆటో బోల్తా పడ్డా ఆటోడ్రైవర్‌తో పాటు ముగ్గురు చిన్నారులు గాయాలయ్యాయి. గాయపడ్డ విద్యార్థులను 108అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వరిసాగు విధానంపై అవగాహన

ఆర్మూర్‌రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోని జికెఆర్ఎస్ కన్వెషన్ హాల్‌లో బుధవారం తక్కువ నీటితో వరిసాగు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. డాక్టర్ రెడ్డిస్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో సీడ్ కాం పెర్టిడ్రిల్ యంత్రంతో పొడి భూమిలో వరి పండించే విధానం, ఎరువులు, విత్తనాలు ఒకేసారి వేసే సౌకర్యంపై ప్రజలకు వివరించారు. దీని ద్వారా వరిసాగు చేయడం వల్ల సుమారు 20శాతం వరకు నీటి అదా అవుతుందని, కూలీల కొరతను అధిగమించవచ్చని సంస్థ ప్రతినిధులు వివరించారు. ఈ కార్యక్రమంలో పెర్కిట్ పీఏసీఎస్ చైర్మన్ పెంట భోజారెడ్డి, మాజీ చైర్మన్ నచ్చు చిన్నారెడ్డి, వీడీసీ కోశాధికారి రాజబాబు, పెద్దకాపు రహీం దర్, హన్మాండ్లు, దయాకర్, సత్యపాల్ పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

నవీపేట,నవంబరు6(ఆంధ్రజ్యోతి): ధ్యానంతోనే మానసిక ప్రశాంతతతో పాటు ఆనందం, ఆరోగ్యం లభిస్తుందని హైదరాబాద్‌కు చెందిన ధ్యాన రత్న మిట్టాపల్లి మనోహర్ అన్నారు. బుధవారం మండలంలోని నాడాపూర్‌లో పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా(పీఎస్ఎస్ఎం) వ్యవస్థాపకులు బ్రహ్మర్షి పితామహ సుభాష్ పత్రిజీ మహ అవతారణ దినోత్సవం సందర్భంగా ఆయన గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడారు. పిరమిడ్లు గొప్ప శక్తి క్షేత్రాలని, ప్రతిరోజు మూడు గంటల పాటు పిరమిడ్‌లో ధ్యానంలో చేస్తే విశ్వంలో ఉన్న అనంతమైన విశ్వశక్తిని పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫోకస్


లింగంపల్లి మెటల్ రోడ్డు ఇదే..


2023 సెప్టెంబరులో గత ప్రభుత్వ హయాంలో వేసిన శిలాఫలకాలు ఇలా..


అచ్చంపేటకు వెళ్లే రహదారి

అధ్వానంగా గ్రామీణ రహదారులు

- నిజాంసాగర్ మండలంలో పలు గ్రామాల రహదారులు తారు రోడ్లుగా మారేదెన్నడో?
- ఆ గ్రామాల రహదారులపై నడక నరకమే..
- గత ప్రభుత్వ హయాంలో రహదారుల నిర్మాణానికి 6.70 లక్షల మంజూరు
- ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై స్థానికుల ఆశలు

నిజాంసాగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆ రహదారి బీటీ రోడ్డుగా నిర్మాణం జరిగేదెన్నడోనని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నిజాంసాగర్ మండలం అచ్చంపేట, మర్పల్లి, లింగంపల్లి, బ్రహ్మణపల్లి గ్రామాలకున్న మెటల్ రోడ్డులను బీటీ రోడ్లుగా మార్చేందుకు అప్పటి తెలంగాణ ప్రభుత్వం స్టేట్ డెవలప్‌మెంట్ నిధుల నుంచి ఆరు కోట్ల 70 లక్షల రూపాయలను మంజూరు చేసింది. ఆ రోడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు సెప్టెంబరు 2023లో అప్పటి ఎమ్మెల్యే హనుమంత్ షిందే చేతుల మీదుగా రోడ్డు నిర్మాణాలు శంకుస్థాపన చేశారు. అప్పట్లో ఈ రోడ్డు నిర్మాణాలు చేపట్టాల్సిన కాంట్రాక్టర్ జాప్యం చేశారు. అక్టోబరు 2023లో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పనులు చేపట్టాల్సిన కాంట్రాక్టు పనులు చేపట్టలేకపోయారు. నవంబరు నెలలో ఎన్నికలు ముగిసి, డిసెంబరు 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ ఈ రహదారులను బీటీ రోడ్డు పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడమే కాకుండా అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు చొరవ చూపకపోవడం పట్లనే రోడ్డు నిర్మాణాలు నిలిచిపోయాయని గ్రామస్థులు వాపోతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరైన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపి వేసిందా? నిధులు వెనుక్కి మళ్లించారనేది ప్రశ్నార్థకంగా మారింది. 2022-2023 ఆర్థిక సంవత్సరం గాను జిల్లా పరిషత్ రహదారి ఆరేడు నుంచి వయా బ్రహ్మణపల్లి మీదుగా మర్పల్లికి రూ.2కోట్ల 70.70లక్షలు, సంగారెడ్డి, నాందేడ్, అకోలా రహదారి నుంచి లింగంపల్లి వయా అచ్చంపేట మీదుగా బీటీ రోడ్డు నిర్మాణాలకు రూ.4కోట్లను మంజూరు చేసి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసింది. రహదారుల నిర్మాణాలకు 14 నెలల క్రితమే శ్రీకారం చుట్టిన పనులు మాత్రం నత్తనడకన కొనసాగడం పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. ఈ గ్రామాల రహదారులు అధ్వానస్థితికి చేరుకోవడమే కాకుండా వర్షాకాలంలో వెళ్లాలంటే గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. దాదాపు ఎన్నో ఏళ్ల నుంచి బీటీ రోడ్డుగా మారని రహదారులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన పనులను ముందుకు సాగకపోవడంతో ఈ గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మారుమూల గ్రామాలైన నాలుగు గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మాణాలతో మహర్దశ వచ్చిందని భావించిన ప్రజలకు నిరాశే మిగిలిపోయింది. స్టేట్ డెవలప్‌మెంట్ నిధుల కిందట రూ.6 కోట్ల 70 లక్షలు మంజూరైన నిధులు కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడికి తరలించారనేది గమనార్హం. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి స్టేట్ డెవలప్‌మెంట్ నిధులు మంజూరైన నిధులతో ఈ గ్రామాల రహదారులను బీటీ రోడ్లుగా నిర్మాణం చేపట్టి గ్రామాల ప్రజలు ఇక్కట్లను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు.


మర్పల్లి రహదారి ఇదే

ఆంధ్రజ్యోతి పరిశీలన


ఎడపల్లిలోని వీధులలో గుంపులుగా తిరుగుతున్న గ్రామసింహాలు


రాణాకలాన్ గ్రామంలో ఓ ఇంటిపై కోతుల మంద ఇలా..

భయపెడుతున్న గ్రామసింహాలు.. బెదరగొడుతున్న వానరాలు!!

- గ్రామాల్లో తప్పని కుక్కల, కోతుల బెడద
- నివారణ చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు

ఎడపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కుక్కలు, కోతులతో ప్రజలు నిత్యం భయభ్రాంతులకు గురవుతూనే ఉన్నారు. వాటి నుంచి కాపాడుకునేందుకు చేయని ప్రయత్నం లేదు. ఇంటి నుంచి కాలు బయట పెట్టి తిరిగి ఇంటికి చేరుకోవాలంటే నిత్యప్రక్రియలో ఎక్కడో ఒకచోట వాటి బెడద ఎదుర్కోని దాటక తప్పడం లేదు. నిత్యం వాటి అల్లరి రోజురోజుకూ పెరుగుతూనే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి తప్పడం లేదు. ప్రస్తుతం గ్రామాల్లో వాకర మూకలైన కోతుల బెడద ఒకవైపు, గ్రామసింహాలైన కుక్కల బెడద మరోవైపు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. గత వారం రోజులుగా రెండింటి కారణంగా రెండంకెల సంఖ్యలో గాయాలపాలై ఆస్పత్రిపాలు అయ్యారంటే వీటి పరిధి ఏమేరకు మితిమీరిందో ఇట్టే తెలుస్తుంది!!

ఒకటి, రెండు గ్రామాల్లోనే నివారణ చర్యలు

ఎడపల్లి మండలంలో 17 గ్రామ పంచాయితీలు ఉండగా అందులో ఒకటి, రెండు గ్రామాలు వీటి నిర్మూలన కోసం చర్యలు చేపట్టారు. అట్టి చర్యలపై జంతు ప్రేమికులు విభేదిస్తూ జిల్లా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో కుక్కల, కోతుల బెడద నివారణ చర్యలు ఆగిపోయాయి. దీంతో వాటి స్వైరవిహారం పరిధి ధాటి ప్రజలను గాయాలపాలు చేసే స్థాయికి చేరింది. ఇలా నిత్యం గ్రామాల్లో ఒంటరిగా ఒక్కరు వెల్లాలన్నా గ్రామసింహాలో లేక వానర మూకల అల్లరి భారిన పడడం తప్పడం లేదు. ఈ విషయంపై గ్రామ ప్రత్యేక అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, రెవెన్యూ, మండల పరిషత్ అధికారులకు ఎన్నిసార్లు నివారణ చర్యలపై మొర పెట్టుకున్నా ఫలితం శూన్యం. దీంతో గ్రామాల్లో వీటి స్వైర విహారం విచ్చలవిడిగా మారింది. పరిస్థితులు చేయి దాటిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామాల్లో ప్రజలతో చర్చించి కోతులు, కుక్కల బెడద నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయం వ్యక్త చేస్తున్నారు. లేని యెడల గ్రామాల్లో పరిస్థితి అధ్వానంగా తయారవుతుందని, స్థానిక ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కోక తప్పదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పది నెలల్లో 400 మందికి పైగా గాయాలు

ఎడపల్లి లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత పది నెలల వ్యవధిలో దాదాపు 351 మంది కుక్కలు, కోతుల దాడికి గురై గాయాలపాలై చికిత్స తీసుకున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రమే కాకా కుక్కల, కోతుల దాడిలో గాయపడిన వారిలో కొందరు నిజామాబాద్, బోధన్ ఏరియా అస్పత్రిలో చికిత్సలు తీసుకున్న వారు ఎంతో మంది ఉన్నారు. వీటివల్ల వచ్చే సమస్యలను పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

భక్తుల కొంగుబంగారం శ్రీమన్నింబాచలం

- లింబాద్రిగుట్టపై నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

భీమ్‌గల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణలోని పవిత్ర పుణ్యక్షేత్రంగా లక్ష్మీనర్సింహస్వామి శ్రీమన్నింబాచల క్షేత్రం ఆలయం నిలుస్తోంది. శ్రీమాన్ నింబాచల క్షేత్రం పురాతన స్వయంభు నరసింహ క్షేత్రాలలో ఒకటి. ఈ పర్వతం మొదటగా అత్యధిక ఔషధ గుణాలు గల వేప చెట్లతో నిండి ఉండడం వల్ల ఈ కొండకు నింబాచలం అని పేరు వచ్చింది. అధీకృత యుగంలో ప్రహ్లాదుడు, బ్రహ్మ దేవుడి కోరిక మేరకు ఈ గుట్టపై నర్సింహస్వామి వారు వెలసినట్లు ప్రచారంలో ఉంది. ఈ ప్రాంతంలో బ్రహ్మదేవుడు, వాయుదేవుడు, రుద్రుడు, యమధర్మరాజు తపస్సు చేసినందు వల్ల దక్షిణ భారత దేశంబరిగా పేరుగాంచి దక్షిణ బద్రిగా నిలుస్తోంది. అంతేకాకుండా స్వయంభు నరనారాయణుడు ఇక్కడే ఉన్నారని చరిత్ర చెబుతోంది. ఈ క్షేత్రం గురించి అష్టాదశ పురాణాల్లో ఒకటైన బ్రహ్మపురాణంలో సవివరంగా లిఖించబడిందంటారు. సనాత ఆలయం ఒక్క మూలవిరాట్ కొండపై గుహల్లో ఉండగా.. ఉత్సవ మూర్తులు స్వామివారు అర్చకులచే పూజలు అందుకుంటున్నారు. కార్తీక మాసంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా గ్రామాలలోని ఉత్సవ మూర్తులను లింబాద్రిగుట్టపై ఆశీనులు చేసి బంగారు నగలతో అలరించి ఆలయ అర్చకులు పది రోజులుల పాటు వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. అలాగే ప్రతీ సంవత్సరం వైశాఖ మాసంలో గ్రామ ఆలయంలో నంబీ వంశస్థులు ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోం ఆలయ మండపం సుమారు వందేళ్ల క్రితం నిర్మించినట్లు.. ఇక్కడ 32 తరాల నుంచి నంబి వంశస్థులు పూజలు నిర్వహిస్తూ ఆలయ అభివృద్ధికి పాటుపడుతున్నారని పురాణాలు చెబుతున్నాయి. గుట్ట పరిసరాల్లో విరాజ్ నది ఉన్నదని భక్తులు నదిలనే స్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకుంటే కోరికలు తీరుతాయని భక్తుల నమ్మం.

- దూర ప్రాంతాల నుంచి భక్తులు హాజరు

కార్తీక మాసంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలలో పాల్గొనేందుకు భక్తులు మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు తెలంగాణలోని అన్ని ప్రాంతాల ఉంచి హాజరై మొక్కులు తీర్చుకుంటారు. ఉత్సవాలలో భాగంగా నిర్వహించే స్వామివారి కల్యాణం, పౌర్ణమి రోజు జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకుంటున్నారు.

- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

లింబాద్రి గుట్టపై కార్తీక మాసంలో జరిగే బ్రహ్మోత్సవాలు ఈనెల 7వ తేదీ గురువారం నుంచి ఈనెల 17వరకు జరగనున్నాయి. నేడు గ్రామంలోని ఆలయంలో దేవతమూర్తులు కొండపైకి బయలుదేరనున్నాయి. 8న దీపారాధన, కుంకుమార్చన, 9న శ్రావణ ప్రయుక్త క్షీరాభిషేకం, 10న స్వామివారి ఎదుర్కోలు, 11న కల్యాణం, 12న గరుడసేవ, 13న తులసీ వివాహం, కొండ ప్రదక్షణం, 14న డోలారోహణం, 15న జాతర, రథ, భ్రమణము, 16న తిరుమంజనం, చక్రతీర్థం, 17న కొండ బలి, పుష్కరినిపై డోలోత్సవం భాగంగా చేపట్టనున్నట్లు ఆలయ అర్చకుడు నంబి పార్థసారథి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఆలయ దర్శనం!!


లింబాద్రిగుట్టకు వెళ్లే మెట్ల దారి


లింబాద్రి గుట్టపై కోనేరు


లింబాద్రి గుట్ట ఆలయ శిఖరం

జాతీయ రహదారిపై ప్రమాదకరంగా గుంతలు


- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు

కమ్మర్‌పల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి సరిహద్దు నుంచి మోర్తాడ్ సరిహద్దు వరకు జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలు వాహనాదారుల పాలిట శాపంగా మారాయి. సంభందిత శాఖ అధికారులు ఎంతమాత్రం పట్టించుకోకపోవడంతో ఇటీవల కమ్మర్‌పల్లి గ్రామ యువకులు, కేబీఏ అసోషియోషన్ సభ్యులు సిమెంట్ కంకరతో గుంతలను పూడ్చి వేయించారు. కానీ ఆ మరమ్మతులు నిల్వలేక పోవడంతో గుంతలు యధావిధిగా ఉన్నాయి. జాతీయ రహదారిపై పలు చోట్ల అడుగులోతు గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నియమవుతున్న సంభందిత శాఖ అధికారుల్లో చలనం రాకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానిక బస్టాండ్ వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహ సమీపంలో గతంలో రహదారి కుంగడంతో గతంలో అధికారులు ప్యాచింగ్ వర్క పనులు చేపట్టారు. కానీ పోసిన తారు కుప్పలను చదును చేయకపోవడంతో వాహనాలు గంతుకుల నుంచి భారీ శబ్దాలు చేస్తూ.. రహదారిపక్క నుంచి వెళ్లేవారిని భయాందోళనలకు గురిచేస్తున్నాయి. దగ్గరకు వచ్చేవరకు వాహనదారులకు గుంత ఏర్పడక అదుపు తప్పడం ప్రమాదాలకు దారితీసిన సంఘటనలు ఉన్నాయి. గుంత వద్ద తరచు ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానికులు వాహనాల స్పీడ్‌ను అదుపు చేయునిమిత్తం, దూరం నుంచి గుంతను గుర్తుపట్టేవిదంగా స్థానికులు గుంతవద్ద ప్రమాద సూచికను ఏర్పాటు చేశారు అయినా ఫలితం లేకుండా పోవడంతో గ్రామయువకులు ప్రమాదాల నివారణలో భాగంగా రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చివేశారు. కానీ పకడ్బందీగా ప్యాచింగ్ పనులు లేకపోవడం, ఇటీవల వర్షాల కారణంగా గుంతల్లో వేసిన సిమెంట్ కొట్టుకుపోయి గుంతలు యధావిధిగా మారాయి. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతల్లో పకడ్బందీగా ప్యాచింగ్ పనులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని స్థానికులు, వాహనాదారులు కోరుతున్నారు.

జర దేఖో!!


వాహనాల స్పీడును అదుపునకు గ్రామస్థులు గుంతవద్ద ఏర్పాటు చేసిన డెంజర్ సిగ్నల్(ఫైల్)


కమ్మర్‌పల్లిలో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద ఏర్పడిన ప్రమాదకర గుంత


గ్రామ శివాల్లో జాతీయ రహదారిపై ఏర్పడిన భారీ గుంత


జాతీయ రహదారిపై అడుగడుగునా ఏర్పడిన గుంతలు ఇలా..

సీఎస్ నిధుల గోల్‌మాల్!

(ఐదో పేజీ తరువాయి)

ఉండగా ఎస్‌వోను బెదిరించి ఇతర రిపేర్ల పేరుతో రెండు లక్షలకు పైగా ఖర్చు పెట్టినట్లు దొంగ బిల్లులు సృష్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. రెండు లక్షలకు పైగా ప్రభుత్వానికి తిరిగి పంపాల్సి ఉండగా కేవలం రూ.30వేలు మాత్రమే పంపినట్లు సమాచారం. విచారణ అధికారి పేరుతో మాజీ జీసీడీవో అనేక అక్రమాలు, అవినీతికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఇటీవల జిల్లా పరిషత్ కులాస్‌పూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా వెళ్లిన ఆమె అక్కడ కూడా సమయపాలన పాటించకుండా వెళ్తున్నట్లు సమాచారం. తోటి ఉపాధ్యాయులపై దురుసుగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తనకు నచ్చిన సమయంలో స్కూల్‌కు వెళ్తూ తోటి ఉపాధ్యాయులపై ఇష్టారీతిన వ్యవహరించడం చేస్తున్నట్లు తెలిసింది. నూతనంగా డీఈవోగా నియమితులైన అశోక్‌కు బుధవారం పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాత డీఈవో చివరి రోజు చేసిన ఫైళ్ల క్లియరెన్స్ ఏఎంవో నియామకం, మాజీ జీసీడీవో అక్రమాలపై ఫిర్యాదు చేశారు.

ఊపందుకోని ధాన్యం కొనుగోళ్లు

(ఐదో పేజీ తరువాయి)

ప్రతిసీజన్‌లో ఈ తరుగు తీయడం వల్ల వేల రూపాయలు రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సంచి బరువు మాత్రమే తీసివేయాల్సి ఉన్నా ఈ తరుగును మాత్రం ఆపడం లేదు. సన్న, చిన్నకారు రైతుల నుంచి పెద్ద రైతుల వరకు ఇదే విధంగా చేయడం వల్ల ఎక్కువ మొత్తంలో రైతులు నష్టపోతున్నారు. సొసైటీలను పర్యవేక్షించాల్సిన సహకార శాఖ అధికారులు మాత్రం కొన్ని సొసైటీల కార్యదర్శులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. గతంలో జరిగిన ఈ తరుగు వ్యవహారంపై సహకార శాఖ రాష్ట్ర అధికారులతో పాటు ఆశాఖ మంత్రికి కూడా జిల్లాకు చెందిన రైతుసంఘాల నేతలు ఫిర్యాదు చేశారు.

జిల్లా వ్యాప్తంగా 89 సొసైటీలు ..

జిల్లాలో 89సొసైటీలు ఉండగా వీటి పరిధిలో సుమారు 380వరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో కొనుగోలు చేసే ధాన్యంలో 75శాతానికిపైగా ఈ కేంద్రాల నుంచే సేకరిస్తున్నారు. ఐకేపీ, మార్కెటింగ్ శాఖ, ఇతర సంఘాల ద్వారా మిగతా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటి ఆధ్వర్యంలో ప్రతి సీజన్‌లో 6నుంచి ఏడున్నర లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రతి సీజన్‌లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ శాతం 17లోపు ఉంటే ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి, దాని ప్రకారం రైతుల ఖాతాల్లో జమచేయాలి, ధాన్యం తూకం వేసే సమయంలో ప్రతి బస్తాకు గన్నీబ్యాగ్‌ను బట్టి 600గ్రాముల వరకు తూకంలో గన్నీబ్యాగ్ బరువును తీసివేయాలి. లేదా అదే మొత్తంలో ఎక్కువ వేసి తూకం వేయాలి. రైతులకు మద్దతు ధర ప్రకారం డబ్బులను ఖాతాల్లో జమచేయాలి. ప్రతి సీజన్‌లో ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించి కొనుగోలు చేయాలి. ఇక్కడే సొసైటీల పరిధిలోని అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. ప్రతి సీజన్‌లో కొన్ని సొసైటీల పరిధిలో భారీ ఎత్తున ధాన్యం కొనుగోలు చేస్తుండగా కొన్నింటి పరిధిలో తక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. అయితే నిబంధనల ప్రకారం రైతుల కోసం ఏర్పాటు చేసిన ఈ సొసైటీల్లో పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టాలి. కొన్నేళ్లుగా ఆ విధంగా జరగడం లేదు. రైతులు ధాన్యాన్ని ఆరబోసి తేమశాతం నిబంధనల మేరకు ఉండేవిధంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చినా కొనడం లేదు. ధాన్యంలో మట్టి, గట్టిపొల్లు, తాలు ఉందనే పేరుచెప్పి కొనుగోలుకు నిరాకరిస్తున్నారు. రైతులకు పలు రకాల కారణాలు చెప్పి క్వింటాలుకు 3కిలోల వరకు తరుగు ఇస్తే కొనుగోలు చేస్తామని చెప్తూ ఆ సీజన్‌లో కొనుగోలు చేశారు. ప్రతి సీజన్‌లో రైతులు కొన్ని గ్రామాలు, మండలాల పరిధిలోని సొసైటీల వద్ద ధర్నా చేసినా పట్టించుకోలేదు. యథావిధిగా తరుగు తీసి కొనుగోళ్లను చేశారు.

టీఎన్‌జీవోస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సుమన్



బాధ్యతలు స్వీకరిస్తున్న సుమన్

సుభాష్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడిగా నాశెట్టి సుమన్ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ కార్యాలయంలో బుధవారం అధ్యక్షునిగా బాధ్యతలను స్వీకరించారు. టిజీవో జిల్లా అధ్యక్షుడు, టీఎన్‌జీవోస్ మాజీ అధ్యక్షుడు అలుక కిషన్ సుమన్‌కు బాధ్యతలను అప్పచెప్పారు. నూతన బాధ్యతలు చేపట్టిన సుమన్‌కు వివిధ శాఖల ఉద్యోగులు అభినందనలు తెలిపారు. వివిధ శాఖల ఉద్యోగులు శాలువాలతో, పూల బుకేలతో ఘనంగా సన్మానించారు. అతి చిన్న వయస్సులో టీఎన్‌జీవోస్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన సుమన్‌ను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సుమన్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ముందుండి పోరాడుతానన్నారు. ఉద్యోగులకు రావాల్సిన హక్కుల కోసం పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో టిజీవో అధ్యక్షుడు, టిఎన్‌జీవోస్ మాజీ అధ్యక్షుడు అలుక కిషన్, ప్రధాన కార్యదర్శి నేతికుంట శేఖర్, ఆకుల ప్రసాద్, పోల శ్రీనివాస్, ఉమాకిరణ్, సుధాకర్, మచ్చేందర్ పాల్గొన్నారు.

సైబర్ జాగృత దివస్‌పై అవగాహన

ఖిల్లా, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):సైబర్ నేరాలపై సీనియర్ సిటి జన్లు అవగాహన కల్పించేందుకు బుధవారం సైబర్ జాగృత దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డీసీపీ కోటేశ్వర్‌రావ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక వినియోగం ఎక్కువ కావడం వల్ల సైబర్ నేరాల సంఖ్య అదే స్థాయిలో పెరిగిపోయిందన్నారు. సైబర్ నేరాలను చెక్ పెట్టడడంసీని యర్ సిటిజన్లకు సమర్థవంతమైన సేవలు అందించడం లక్ష్యంగా సైబర్ జాగృత పనిచేస్తుందన్నారు. పోలీసు శాఖ ప్రత్యేకంగా రూపొందించిన 1930ద్వారా సైబర్ క్రైమ్ రిపోర్ట్ చేయవచ్చన్నారు. బాధితులు డబ్బులు పోయిన వెంటనే ఫిర్యాదు చేయడానికి ముందుకు రావాలన్నారు. మోస పూరిత లావదేవీలు జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే వాటిని తక్షణం నిల పివేసి సంబంధిత వారి ఖాతా ఫ్రీజ్ చేసే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్స్‌కు డిజిటల్ అరెస్ట్ స్కామ్స్ ఇన్వేస్టు మెంటు ఫ్రాడ్స్, ఇంపర్సోనేషన్ (వేషధారణ)వాటి పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ పోలీసులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆహ్వానితులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఏసీపీ వై.వెంకటేశ్వరరావ్, నిజామాబాద్ ఏసీపీ. ఎల్ రాజవెంకట్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ శ్రీశైలం, నిజామాబాద్ సీనియర్ సిటిజెన్స్, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారుడి ఆత్మహత్య

మోపాల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముదక్‌పల్లి గ్రామానికి చెందిన తల చిన్నయ్య (63) బుధవారం చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. చిన్నయ్య గత రాత్రి కులాస్‌పూర్ చెరువులో దొంగతనంగా చేపలు పట్టేందుకు వెళ్లగా అక్కడ ఉన్న మత్స్యకారులు గమనించి బుధవారం ఉదయం చిన్నయ్య ఇంటికి వచ్చారు. గత రాత్రి చెరువులో చేపలు పట్టడానికి ఎందుకు వచ్చావని ప్రశ్నిస్తుండగానే బయటకు వెళ్లి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్నయ్య కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శాస్త్ర సాంకేతికతకు సంఖ్యాక శాస్త్రమే మూలాధారం

● టీయూ వీసీ యాదగిరి రావు




సదస్సులో మాట్లాడుతున్న వీసీ యాదగిరి రావు

డిచ్‌పల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర సాంకేతికతకు సంఖ్యాక శాస్త్రమే మూలాధారమని టీయూ వీసీ ప్రొ.యాదగిరి రావు అన్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయంలో బుధవారం డిపార్టుమెంట్ ఆఫ్ స్టాటటిక్స్, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా బుధవారం అవగహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ యాదగిరి రావు మాట్లాడుతూ.. స్టాటటిక్స్ అనుకరణ ప్రాముఖ్యతను వివరించారు. స్టాటటిక్స్ నూతన ఆవిష్కరణలు సమాజంలో అన్ని శాస్త్రాలను ప్రభావితం చేస్తుందన్నారు. గణాంక శాస్త్ర భావానలను ప్రధానంగా శాస్త్ర సాంకేతిక ప్రసార రంగాన్ని బలోపేతం చేసి సమాజ పురోగాభివృద్ధికి దారి చూపుతాయన్నారు. రిజిస్ట్రార్ యాదగిరి పరిశోధనలు సంఖ్యాక శాస్త్రం ఆవశ్యకతను వివరించారు. తెలంగాణ వర్సిటీ కో ఆర్డినేటర్ డా.వాసం చంద్రశేఖర్ మాట్లాడుతూ.. సంఖ్యాక శాస్త్రంతో వివిధ శాస్త్రల అనువర్తనాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త, విభాగాధిపతి ప్రొ.సంపత్ కుమార్, సైన్స్ డీన్ ప్రొ.ఆరతి, డా.పురుశోత్తం, రాజేశ్వర్, నర్సింహులు, పలు కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల సమస్యల పరిష్కారానికి కృషి

● ట్రస్మా నూతన జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్ కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

బోధన్‌రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ట్రస్మా నూతన జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్ కుమార్ అన్నారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కిషోర్ కుమార్ పట్టణంలోని ఇందూర్ బీఈడీ కళాశాలలో బుధవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై బాధ్యత ఉంచి జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఏకగ్రీవంగా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ప్రైవేటు పాఠశాలల విద్యుత్ బిల్లులు, పన్నులు తగ్గించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. బడ్జెట్ పాఠశాలలుగా ప్రైవేటు పాఠశాలలు నడుస్తున్నాయన్నారు. తమ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో ఫీజులు వసూలు చేయరని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్యుత్ బిల్లుల విషయంలో సంబంధిత మంత్రులు, అధికారులతో మాట్లాడి బిల్లులు తగ్గించేలా కృషి చేస్తామన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వంశీ ఇంటర్నేషన్ హోటల్‌లో జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమానికి అన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా ముఖ్య సలహాదారులు సిరిగిరి దిగంబర్ రావు, జిల్లా కోశాధికారి సత్యనారాయణ రెడ్డి, బోధన్ ప్రైవేట్ పాఠశాలల, కళాశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు ముత్యాల హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి మంతె సురేష్, గౌరవ అధ్యక్షుడు యార్లగడ్డ శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు మిద్దెల రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఈత పోటీలకు జునారియా అన్మోల్

సుభాష్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఎస్‌జిఎఫ్ ఈత పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారిణి జునారియా అన్మోల్ ఎంపికైంది. రాష్ట్రస్థాయి పోటీలలో 200 మీటర్లు, 400 మీటర్లలో వెండి పతకాన్ని, 50 మీటర్ల బటర్‌ఫ్లైలో బ్రౌంజ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. జాతీయ స్థాయి పోటీలు నవంబర్ 24 నుంచి 30 వరకు గుజరాత్ రాష్ట్రంలోని రాజ్‌కోట్‌లో జరుగనున్నాయి. జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల అభ్యాస స్కూల్ యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు.

సరస్వతీ విగ్రహ ప్రతిష్ఠాపన

ధర్పల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చదువుల తల్లి సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం మండల కేంద్రంలోగల శారద విద్యానికేతన్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాలలో సరస్వతీ విగ్రహ ప్రతిష్ఠాపన చేయడం వల్ల విద్యార్థులకు చదువు పట్ల మక్కువ ఏర్పడుతుందని పాఠశాల కరస్పాండెంట్ దత్తాద్రి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఓటరు నమోదుపై సమీక్ష నిర్వహించిన కమిషనర్

సుభాష్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ అధికారులతో, వివిధ పార్టీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని నగర పాలక సంస్థ కార్యాలయంలో ఓటరు నమోదుపై సమీక్షించారు. ఈనెల 9, 10వ తేదీల్లో ఓటరు నమోదులో మార్పులు, చేర్పులు చేసుకోవాలని ఆ దిశగా అధికారులు కృషి చేయాలని అన్నారు. ఓటరు నమోదులో తప్పు ఒప్పులకు ఇది మంచి అవకాశం అని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు సైతం తుది జాబితాను తప్పులు లేకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వోలు, బిఎల్‌వోలు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేలో కమిషనర్..

నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న ఇంటింటి సర్వే పనితీరును నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ పరిశీలించారు. నగరంలోని న్యాల్‌కల్‌రోడ్, రేడియోస్టేషన్, పీఎఫ్ ఆఫీస్ ప్రాంతాల్లో బుధవారం సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే చేస్తున్న అధికారులకు పలు సూచనలు చేశారు. సర్వే పక్కాగా ప్రణాళిక బద్ధంగా చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వేలో తప్పులకు తావులేకుండా చూడాలన్నారు. గడప గడపకు వెళ్లి సర్వే నిర్వహించాలని తెలిపారు. మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వే నిర్వహించాలన్నారు. సర్వే విజయవంతం చేయడానికి అన్ని వర్గాల వారు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సర్వే అధికారులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డితో డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి

సీఎంను కలిసిన డీసీసీబీ చైర్మన్

నిజామాబాద్ అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో దెబ్బతిన్న బాధితులకు అండగా నిలిచేందుకు ఉమ్మడి జిల్లా కేంద్ర బ్యాంక్ నుంచి కోటి 51లక్షల 116రూపాయలను ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించారు. సీఎం రేవంత్‌రెడ్డిని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి కలిశారు. వరద బాధి తుల కోసం చెక్కును అందించారు. సీఎంను కలిసిన సమయంలో రైతు భరోసా, రుణమాఫీ, బ్యాంకు అభివృద్ధి వంటి అంశాలపై చర్చించారు.

ఇంటర్ ఫీజు చెల్లించాలి: డీఐఈవో

నిజామాబాద్ అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్మీడియెట్ విద్యార్థులు వార్షిక పరీక్ష ఫీజు చెల్లింపు తేదీని ప్రకటించిందని కావున విద్యార్థులు ఇంటర్ ఫీజు చెల్లించాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈనెల 26లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని ఆయన తెలిపారు. ఇంటర్ బోర్డ్ ఆయా గ్రూపుల విద్యార్థుల పరీక్ష ఫీజులను ఆన్‌లైన్‌లో ఉంచడం జరిగిందని ఆ మేరకు విద్యార్థులకు ఫీజును ఆయా కళాశాలల్లో ప్రిన్సిపాల్ ద్వారా చెల్లించాలన్నారు. ఈనెల 26లోగా ఎలాంటి అపరాద రుసుము లేకుండా చెల్లించవచ్చని, డిసెంబర్ 27 లోగా 2వేల రూపాయల అపరాద రుసుముతో చెల్లించవచ్చన్నారు. వొకేషనల్ విద్యార్థులు రూ.750, ఆర్ట్స్ కోర్సులకు రూ.520, సైన్స్ విద్యార్థులకు రూ.750 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మొదటి సంవత్సరంలో ఫెయిల్ అయిన సప్లిమెంటరీ విద్యార్థులు అదనంగా మరో రూ.520 చెల్లించాలని, ప్రాక్టికల్స్ ఫెయిల్ అయిన వారు అదనంగా రూ.250 చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

క్రీడాకారుడు సాయిప్రసన్నకు ఎమ్మెల్యే అభినందన

సుభాష్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన క్రీడాకారుడు సాయిప్రసన్నను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అభినందించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. రాష్ట్రస్థాయి పోటీలలో ఘనవిజయం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా కోచ్ మనోజ్‌కుమార్‌ను, సాయిప్రసన్న తండ్రి గంగాధర్‌ను అభినందించారు.



వేం నరేందర్‌రెడ్డిని కలిసిన గడుగు గంగాధర్

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన గడుగు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన గడుగు గంగాధర్ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఇతర సభ్యులతో కలిసి ఆయన వేంనరేందర్‌రెడ్డిని కలిసి ఘనంగా సన్మానించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారు ఎం.రఘునందన్‌రావు, సీనియర్ ఐఏఎస్ అధికారిణి క్రిష్టినా జెడ్ చొంగ్తూలను గడుగు గంగాధర్ మర్యాధపూర్వకంగా కలిసి వారిని సన్మానించారు.

సీనియర్ జర్నలిస్ట్‌కు డాక్టరేట్

నిజామాబాద్ అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ కుంచం శ్రీనివాస్ డాక్టరేట్‌ను అందుకున్నారు. గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీలంక యూత్ పార్లమెంట్ విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి, అంతర్జాతీయ దౌత్య వేత్తల అధ్యక్షుడు అహమ్మద్ సాబిక్ చేతుల మీదుగా బుధవారం హైదరాబాద్‌లోని సరస్వతీ పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ అందుకున్నారు. శ్రీనివాస్ జర్నలిజం వృత్తిలో 25 సంవత్సరాలుగా కార్మికులు, బడుగు బలహీన వర్గాల పక్షాన అనేక వార్తా కథనాలను రాశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశాల గడువు పెంపు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం గడువు ఈనెల 15 వరకు పొడగించినట్లు అధ్యయన కేంద్రం ప్రాంతీయ సమన్వయకర్త రంజిత తెలిపారు. బుధవారం గిరిరాజ్ కళాశాలలోని అధ్యయన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఆమె మాట్లాడారు. ఇప్పటి వరకు డిగ్రీ, పీజీ కోర్సుల్లో సుమారు 1200 మంది నమోదు చేసుకున్నారని ఎంబీఏ కోర్సులో ప్రవేశం కోసం టిజిఐసెట్‌లో అర్హత కలిగి ఉండి అంబేద్కర్ యూనివర్సిటీ నిర్వహించే అర్హత పరీక్షల్లోనూ అర్హత కలిగి ఉండాలన్నారు. ఈ అర్హత పరీక్ష కోసం ఈనెల 8వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకొని 9వ తేదీన నిర్వహించే పరీక్షకు హాజరుకావచ్చన్నారు. డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం, పీజీ రెండవ సంవత్సరం ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు గడువు ఈనెల 15 వరకు పొడిగించినట్లు ఆమె తెలిపారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల ధర్నా

సుభాష్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నిజామాబాద్‌లోని ధర్నాచౌక్‌లో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఒక్కరోజు దీక్షను చేపట్టారు. ఈ దీక్షను సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీ కార్మికులకు సంబంధించిన ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని సీఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి గంగాధర్‌లు ఆరోపించారు. కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి పట్టించుకోలేదన్నారు. కనీస వేతనం 26వేలకు పెంచుతామని చెప్పి పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో అన్ని అంశాలు పెట్టి ఇప్పుడు మాత్రం ఏ ఒక్కటి అమలు చేయడం లేదన్నారు. హామీల అమలు కోసం మంత్రి సీతక్క, కమీషనర్ అనిత రాంచంద్రన్‌లను ఎన్నిసార్లు కలిసిన పరిష్కరించడం లేదన్నారు. పండుగ సెలవులు, ఆదివారాలు కూడా పనిచేయిస్తున్నారని ఆరోపించారు. కార్మికులు చనిపోతున్నా కనీసం పరిహారం కూడా చెల్లించడం లేదన్నారు. వేతనాలు కూడా ఆరు నెలలుగా చెల్లించడం లేదని వారు ఆరోపించారు. గ్రామ పంచాయతీలో పంప్ మెకానిక్‌లుగా పనిచేస్తున్న వారికి మిషన్ భగీరథకు మార్పు చేసి వారితో పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజేష్, సీఐటియు జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, సహాయ కార్యదర్శి నస్నేసాబ్, సాగర్, రాజేష్, పోశెట్టి, లక్ష్మి, భూమయ్య, అనిత, సాయిలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

సిరికొండ నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) ఏర్గట్ల సెక్షన్‌లోని బట్టాపూర్‌లో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తూ మృతిచెందిన శ్రీరాములు కుటుంబానికి 2007 బ్యాచ్‌కు చెందిన లైన్‌మెన్‌లు రూ.35వేల ఆర్థిక సహాయాన్ని బుదవారం అందజేశారు. శ్రీరాములు ఇటీవల గుండెపోటుతో మరణించాడు. ఆయనకు కుమారుడు, కూతురు, భార్య, తల్లి, తమ్ముడు ఉన్నారు. సహచర లైన్‌మెన్‌లు మాట్లాడుతూ.. తామంతా ఒకే బ్యాచ్‌కు చెందిన వారమని, తమతో కలిసి విధులు నిర్వర్తించిన శ్రీరాములు ఆకస్మికంగా మరణించడం తమకు బాధనిపించిదన్నారు. ఆయన కుటుంబానికి తమకు తోచినంత ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందని చెప్పారు.

గల్ఫ్ ఏజెంట్ మోసం..

● కుమారుడిని విదేశాలకు పంపించకపోవడంతో తండ్రి మనస్తాపం.. గుండెపోటుతో మృతి

● ఏజెంట్ ఇంటి వద్ద మృతదేహంతో కుటుంబీకుల ఆందోళన



రాజేష్‌లాల్ (ఫైల్)

ఆర్మూర్ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడిని ఓ గల్ఫ్ ఏజెంట్ విదేశాలకు పంపిస్తానని పంపించకుండా మోసం చేయడంతో.. మనస్తాపానికి గురైన తండ్రి గుండెపోటుతో మృతి చెందిన ఘటన ఆర్మూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబీకుల కథనం ప్రకారం.. జిల్లాలోని జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ గ్రామానికి చెందిన రాజేష్‌లాల్ (55) వృత్తిరీత్యా కొన్నేళ్లుగా ఆర్మూర్‌లో స్థిరపడ్డాడు. ఇతనికి సృజన్ అనే కుమారుడు ఉన్నాడు. ఉద్యోగం నిమిత్తం తన కుమారుడిని విదేశాలకు పంపాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా ఆర్మూర్‌కు చెందిన గల్ఫ్ ఏజెంట్ డీకొండ ప్రసాద్ ను రాజేష్‌లాల్ సంప్రదించాడు. యూరప్ దేశాల్లో ప్రస్తుతం మంచి వేతనాలు ఉన్నాయని, సృజన్‌ను ఎలాగైనా ఏదైనా ఓ యూరప్ దేశానికి పంపిస్తానని మాట ఇచ్చాడు. ఇందుకు రూ.5లక్షలు చెల్లించాలని ప్రసాద్ కోరగా.. రాజేష్‌లాల్ ఏడాది క్రితం రూ.4.50లక్షలు ఇచ్చాడు. అయితే చెప్పిన మాట ప్రకారం కాకుండా సృజన్‌ను విదేశాలకు పంపకుండా మోసం చేయడంతో.. తాను చెల్లించిన మొత్తాన్ని తిరిగి ప్రసాద్‌ను రాజేష్‌లాల్ కోరాడు. ప్రసాద్ తన కుమారుడిని విదేశాలకు ఎంతకూ పంపించకపోవడం.. తిరిగి డబ్బులు ఇవ్వకపోడంతో రాజేష్ లాల్ తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. బుధవారం ఉదయం ఈ విషయమై ప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడుతుండగా.. రాజేష్‌కు ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యాడు. కుటుంబీకులు వెంటనే ఆర్మూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో ఆగ్రహానికి గురైన కుటుంబీకులు.. రాజేష్‌లాల్ మృతదేహంతో ఏజెంట్ ప్రసాద్ ఇంటి ఎదుట ఆందోళన చేశారు. ఏజెంట్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి ఘటనా స్థలికి వచ్చి ఆందోళకారులతో మాట్లాడి సముదాయించారు. న్యాయం చేస్తానని చెప్పడంతో మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకువెళ్లారు. కాగా.. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు




రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.95	రూ.230	రూ. 250
వెన్‌కాబ్(కిలో)	: రూ.100	రూ.235	రూ. 255

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.81300	రూ.75000	రూ.990

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

పీవీఆర్ మల్టిప్లెక్స్ (వేణుమాల్)
స్ర్కీన్-1 : బూల్ బులియా-3 (హిందీ) (9.35, 4.10)
: సింగం అగేన్ (హిందీ) (1.00, 7.35, 10.45)
స్ర్కీన్-2 : లక్కీ భాస్కర్ (10.00, 1.15, 4.30, 7.45, 11.00)
స్ర్కీన్-3 : సింగం అగేన్ (హిందీ) (9.25)
: క (12.35, 7.15)
: భగీరా (3.50)
: బూల్ బులియా-3 (హిందీ) (10.30)
స్ర్కీన్-4 : అమరన్ (9.50, 1.20, 7.25, 10.55)
: వేనం (ఇంగ్లీష్) (4.50)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : లక్కీ భాస్కర్ (10.40, 1.35, 7.30, 10.30)
: క (4.30)
స్ర్కీన్-3 : అమరన్ (10.10, 1.20, 4.35, 7.35)
: క (10.40)



దేవి : లక్కీ భాస్కర్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : అమరన్ (11.15, 6.15)
: సింగం అగేన్ (హిందీ) (2.15, 9.15)
విజయ్ : క (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: దేవర (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్